రైతుకు ఆపన్నహస్తం అందేనా?

- ఈదురు గాలులతో ఎకరాల్లో నేలకొరిగిన పండ్ల తోటలు, పంటలు
- పెట్టుబడులు మట్టిపాలవడంతో అన్నదాతలకు తీవ్ర నష్టం


పుట్లూరు మండలం ఎల్లుట్లలో దెబ్బతిన్న మొక్కజొన్న


పుట్లూరు మండలం జంగంరెడ్డిపేటలో దెబ్బతిన్న అరటిని చూపుతున్న రైతు నారాయణప్ప

పుట్లూరు: రూ.లక్షల వ్యయంతో సాగు చేసిన పంట చేతికి అందే సమయంలో మట్టిపాలు కావడం రైతన్నలను కలచివేస్తోంది. అతివృష్టి, అనావృష్టితో పాటు ఈదురు గాలుల వల్ల వచ్చే నష్టానికి రైతులు కొలుకోలేక పోతున్నారు. శనివారం రాత్రి వీచిన ఈదురు గాలుల వల్ల శింగనమల నియోజకవర్గంలోని పండ్ల తోటలతోపాటు వివిధ పంటలు దెబ్బతిని రైతులు నష్టపోయారు. నియోజకవర్గంలోని పుట్లూరు, యల్లనూరు, శింగనమల మండలాల్లో ఈ నష్ట తీవ్రత ఎక్కువగా కనిపిస్తోంది. పుట్లూరు మండలంలో 200 ఎకరాల్లో అరటి, 16 ఎకరాల్లో మొక్కజొన్న, 5 ఎకరాల్లో బొప్పాయి దెబ్బతిన్నట్లు అధికారులు చెబుతున్నారు.

క్షేత్ర స్థాయిలో నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు

ఈదురు గాలులు, వర్షం వల్ల దెబ్బతిన్న పండ్ల తోటలను సోమవారం వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి అంచనా వేశారు. అరకొరగా దెబ్బతిన్న పండ్ల తోటలను పరిగణలోకి తీసుకోవడం లేదని రైతులు వాపోతున్నారు. నేలకొరిగిన అరటికి ఎకరాకు రూ.14 వేలు పరిహారం అందుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే అరకొర పరిహారం కాకుండా నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం బీమా చెల్లించి ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

కౌలు రైతుల పరిస్థితి దారుణం

గత ఐదేళ్లుగా అరటి పంటను సాగు చేయడానికి బోరుబావులు ఉండే భూములకు డిమాండ్ పెరిగింది. గతంలో ఎకరాకు గరిష్టంగా రూ.20 వేలు చెల్లించి అరటి సాగుకు కౌలు తీసుకుంటుండగా ప్రస్తుతం రూ.40 వేల వరకు కౌలు చెల్లిస్తున్నారు. ఇలా కౌలుకు సాగు చేసిన రైతులకు పంట నష్టం వాటిల్లిన సమయంలో పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో పాటు కౌలు కార్డులను తీసుకోకపోవడంతో కనీసం ప్రభుత్వం అందించే అరకొర పరిహారం కూడా చేతికి అందని పరిస్థితి ఉంటుంది.

కోలుకోలేని దెబ్బ



రాకాసి గాలుల వల్ల కోలుకోలేని దెబ్బ తగిలింది. మూడు ఎకరాల్లో మొక్క జొన్న, రెండు ఎకరాల్లో అరటి సాగు చేశా. గాలులకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. అరటి రూ.6 లక్షలు, మొక్కజొన్న రూ.3లక్షలు నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపోయిన రైతులను ఆదుకోవాలి.

– ప్రకాష్, మడ్డిపల్లి

2,500 చెట్లు నేలకూలాయి



నాలుగు ఎకరాల్లో అరటి పంటను సాగు చేశాను. శనివారం రాత్రి ఈదురు గాలులు భారీగా రావడంతో ఆదివారం ఉదయాన్నే తోట వద్దకు వెళ్లాను. అక్కడ దాదాపు 2500 అరటి చెట్లు నేలపై విరిగిపడ్డాయి. దాదాపు రూ.5లక్షల వరకు నష్టం వాటిల్లింది. అరటి రైతులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి.

– సుధాకర్, మడ్డిపల్లి

రూ.3 లక్షల నష్టం



ఎకరాకు రూ.1.5 లక్షల పెట్టుబడితో మూడు ఎకరాల్లో అరటి పంటను సాగు చేశాను. పంట దిగుబడి చేతికి వచ్చే సమయంలో ఈదురు గాలుల వల్ల దాదాపు 70 శాతం అరటి చెట్లు నేలకొరిగాయి. దీంతో రూ.3లక్షల మేరకు నష్టం వాటిల్లింది. పెట్టుబడి కూడా చేతికి అందని పరిస్థితి ఏర్పడింది.

– శివనారాయణరెడ్డి, మడ్డిపల్లి

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈదురు గాలుల వల్ల కోలుకోలేని నష్టం వాటిల్లింది. రెండు ఎకరాల్లో రూ.3.5 లక్షల వ్యయంతో అరటిని సాగు చేస్తే మొత్తం గాలులకు పడిపోయింది. పడిపోయిన గెలలు కొనే పరిస్థితి లేకపోవడంతో వాటిని గెట్లకు వేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం బీమా కల్పించి అరటి రైతును ఆదుకోవాలి.

– మల్లారెడ్డి, జంగంరెడ్డిపేట

క్లుప్తంగా

త్రైత సిద్ధాంత క్యాలెండర్ల ఆవిష్కరణ


క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న రైల్వే సీనియర్ డీఎంఈ ప్రమోద్

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని రైల్వే డీజిల్ షెడ్‌లో సోమవారం సీనియర్ డీఎంఈ ప్రమోద్ త్రైత సిద్ధాంత క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత కమిటీ అధ్యక్షుడు రవి కుమార్, సభ్యులు రాజేంద్ర ప్రసాద్ రెడ్డి, బ్రహ్మ, నాగరాజు, వలి, రామాంజి, రాజారావు, వీరయ్య, వంశీ, పృథ్వీ , సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వత్థంలో బియ్యం, బేడల వేలం


వేలం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: మాఘమాసం తిరునాల సందర్భంగా చిన్నపప్పూరులోని అశ్వత్థంలో భక్తులు సమర్పించిన బియ్యం, బేడలను సోమవారం దేవదాయశాఖ ఈఓ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించారు. 894 బియ్యం బస్తాలు (బస్తా 50 కిలోలు) కిలో రూ.29 ప్రకారం యాడికి గ్రామానికి చెందిన ఎం.బాలరాముడు వేలం పాడి హక్కు పొందాడు. బియ్యం బేడల వేలం పాట ద్వారా ఈ ఏడాది ఆలయానికి రూ1296300 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


మాట్లాడుతున్న తూనికలు, కొలతల శాఖ అధికారి శంకర్

గుంతకల్లు: వ్యాపారులు నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని తూనికలు, కొలతలశాఖ అధికారి వైజీ శంకర్ హెచ్చరించారు. సోమవారం స్థానిక మార్కెట్ సమీపంలోని ఇల్లూరి లక్ష్మీనారాయణ భవన్‌లో కిరాణా, తినుబండారాలు విక్రయించే వ్యాపారులు పాటించాల్సిన నియమాలు, నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తినుబండారాలు నాణ్యత కల్గి ఉండాలన్నారు. తయారీ తేదీతోపాటు ముగింపు తేదీ ముద్రించడంతోపాటు కంపెనీ చిరునామా, సెల్ నంబర్ తప్పనిసరిగా తెలియజేయాలన్నారు. తూకల్లో మోసాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో వర్తకుల సంఘం జిల్లా అధ్యక్షుడు గోపా జగదీష్, నాయకులు ఇల్లూరు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అరటి తోటల పరిశీలన


రంగమనాయునిపల్లిలో దెబ్బతిన్న అరటి తోటను పరిశీలిస్తున్న ఆర్డీఓ కేశవనాయుడు

పుట్లూరు: మండలంలోని కుమ్మనమల, చెర్లోపల్లి రెవెన్యూ గ్రామాల్లో దెబ్బతిన్న అరటి తోటలను సోమవారం ఆర్డీఓ కేశవనాయుడు పరిశీలించారు. ఈదురు గాలుల వల్ల తీవ్రంగా నష్టపోయామని రైతులు ఆయన ముందు వాపోయారు. క్షేత్ర స్థాయిలో జరిగిన పంట నష్టంపై నివేదిక పంపుతామని ఆయన తెలిపారు. ఈయన వెంట తహసీల్దార్ శేషారెడ్డి, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వాడకం తగ్గించాలి


అల్తాఫ్‌ను సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

బుక్కరాయసముద్రం: ప్లాస్టిక్ వాడకం ప్రతి ఒక్కరూ తగ్గించాలని ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు అల్తాఫ్ సూచించారు. మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్ఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో జంతలూరు గ్రామంలో జాతీయ సేవా పథకం ఎన్ఎస్ఎస్ యూనిట్–3 వారు ఏడు రోజుల ప్రత్యేక శిబిరం ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ సేవా కార్యక్రమాలలో భాగంగా వారం పాటు నిరుద్యోగం , అక్షరాస్యత సర్వే, స్వచ్ఛ భారత్, ప్లాస్టిక్ నివారణ, వడదెబ్బ, వాటి నివారణ మార్గాలు డిజిటల్ లావాదేవిలు, నీటి సంరక్షణ, స్వయం ఉపాధి, పథకాల అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించనున్నట్లు కళాశాల ఎన్ఎస్ఎస్ పీఓ అరవింద్ బాబు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, లక్ష్మిరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ లక్ష్మీనారాయణ, మధుసూదన్, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు.

వాహనం బోల్తా.. ముగ్గురికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని రామ్‌దాస్ పేట సమీపంలో 44వ జాతీయ రహదారిపై సోమ వా రం జరిగిన ప్రమాదంలో ముగ్గురికి గాయాలవడంతోపాటు రెండు గొర్రెలు మృతి చెందాయి.ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా మాట్లాడుతూ తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన ఆరుగురు కర్నూలు జిల్లా పత్తికొండలో సంతకు వెళ్లి 50 గొర్రెలు కొనుగోలు చేశారు. వాటిని బొలెరో వాహనంలో వేలూరుకు తీసుకెళ్తుండగా.. రామ్‌దాస్‌పేట సమీపంలో వెనుక టైరు పంచర్ కావడంతో వాహనం అదుపు తప్పి డివైడర్ ఎక్కి రోడ్డుపై బోల్తా పడింది. ఘటనలో రెండు గొర్రెలు మృతి చెందగా శ్రీనివాసులు, వినోద్‌కుమార్, మునిరత్నంకు గాయాలయ్యాయి. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి క్షతగాత్రులను అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

మహిళకు గాయాలు


గాయపడిన శేషమ్మ

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై సోమవారం ద్విచక్రవాహనంలో నుంచి జారి పడి శేషమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తొండపాడు గ్రామానికి చెందిన రాఘవేంద్రగౌడ్ తన భార్య శేషమ్మతో కలిసి బైక్‌లో వెళ్తుండగా ఆమె కింద పడింది. తీవ్రంగా గాయపడిన శేషమ్మను వెంటనే గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు ఆమెను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

28న హుండీ కానుకల లెక్కింపు

గుంతకల్లు రూరల్: దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన బుగ్గ సంగమేశ్వర ఆలయంలో ఈ నెల 28న భక్తులు స్వామివారికి సమర్పించిన హుండీ కానుకలను లెక్కించనున్నట్లు ఈఓ క్రిష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి ప్రారంభమయ్యే హుండీ లెక్కింపు కార్యక్రమానికి గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు హాజరుకావాలని ఆయన కోరారు.

పామిడిలో..

పామిడి: పట్టణంలోని భోగేశ్వరాలయం, చెన్నకేశవ ఆలయాలకు సంబంధించిన హుండీల లెక్కింపు ఈనెల 28న చేపట్టనున్నట్లు ఈఓ ఏ క్రిష్ణయ్య, అర్చకులు దేవగుడి రామేశ్వరశర్మ, చంద్రాశర్మ, అనిల్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. హుండీల లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనే భక్తులు పంచె, కండువా ధరించి రావాలన్నారు.

నేడు మండల సమావేశం

పుట్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అలివేలమ్మ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని ఆమె కోరారు.

ఉగాది ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

గుంతకల్లు రూరల్: కసాపురం నెట్టికంటి ఆంజనేయ స్వామి దేవస్థానంలో ఈ నెల 30 నుంచి నిర్వహించనున్న ఉగాది ఉత్సవాలకు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంను ఆహ్వానిస్తూ సోమవారం ఈఓ కే.వాణి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఆలయ అనువంశిక ధర్మకర్త సుగణమ్మ, ఇతర సిబ్బందితో కలసి ఎమ్మెల్యేను కలసిన ఈఓ ఉత్సవాలకు హాజరుకావాలని విన్నవించారు. ఆలయ ఏఈఓ రామాంజనేయులు, అర్చకులు, వేద పండితులు పాల్గొన్నారు.

రైతుపై దాయాదుల దాడి


గాయపడిన రామాంజనేయులు

గుత్తి రూరల్: మండలంలోని మార్నేపల్లి శివారులో రామాంజనేయులు అనే రైతుపై సోమవారం అతడి బంధువులు దాడి చేసి గాయపరిచారు. బాధిత రైతు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గుంతకల్లు మండలం గొల్లలదొడ్డి గ్రామానికి చెందిన రామాంజనేయులుకు దాయాదులతో పొలం సరిహద్దు విషయంలో గొడవలు ఉండేవి. ఈ క్రమంలో రెవెన్యూ అధికారులు పొలంలో సర్వే చేస్తుండగా గొడవ జరిగింది. రామాంజనేయులు తన పొలం కొలతలు తక్కువగా వస్తున్నాయని సమీప బంధువులతో వాదనకు దిగాడు. దీంతో గొల్లలదొడ్డికి చెందిన లాలెప్ప, సుధాకర్, ప్రవీణ్‌కుమార్ తదితరులు రామాంజనేయులుపై విచక్షణారహితంగా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన రామాంజనేయులును వెంటనే బంధువులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు బహిరంగ సభ

యల్లనూరు: ఎంపీడీఓ కార్యాలయ ఆవరణంలో మంగళవారం ఉపాధిహామీ పథకం సామాజిక బహిరంగ సభను ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి సోమవారం తెలిపారు. ఉపాధి పథకంలో జరిగిన పనులు, కూలీల వివరాలను క్షేత్రస్థాయిలో విచారణ చేసి డీఆర్పీలు నివేదికలను తయారు చేశారన్నారు. సామాజిక బహిరంగ సభలో జిల్లా అధికారుల సమక్షంలో నివేదిక చదివి వినిపిస్తారన్నారు.

ఘర్షణలో దంపతులకు గాయాలు



గాయపడిన లక్ష్మీదేవి, రామకృష్ణ

గుత్తి రూరల్: మండలంలోని జక్కలచెరువు ఆర్ఎస్ గ్రామంలో పొలానికి వెళ్లే రస్తా విషయంలో సోమవారం ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామకృష్ణకు పక్క పొలం రైతు ప్రసాద్‌తో కొన్ని నెలలుగా రస్తా విషయంలో గొడవలున్నాయి. ఈ క్రమంలో గ్రామ శివారులో ఉన్న పొలం వద్ద ఘర్షణ జరిగి తీవ్ర స్థాయిలో వాగ్వాదం చేసుకున్నారు. ఈ క్రమంలో మాటామాటా పెరిగి ఇరువర్గాల వారు పరస్పరం దాడులు చేసుకున్నారు. దాడిలో రామకృష్ణ, లక్ష్మీదేవి దంపతుల తలకు బలమైన గాయాలవడంతో బంధువులు గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుమారు పది మంది తమపై దాడి చేసి గాయపరిచారని బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు జంబులదిన్నె సొసైటీ మహా జనసభ

గార్లదిన్నె: స్థానిక జంబులదిన్నె సొసైటీ మహాజన సభ బుధవారం నిర్వహిస్తున్నట్లు సీఈఓ సదాశివ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ సంఘంలోని సభ్యులందరూ హాజరు కావాలన్నారు.

రమేష్‌రెడ్డి కాలనీలో ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందు ఇస్తున్న రమేష్‌రెడ్డి

తాడిపత్రిటౌన్: పట్టణంలోని రమేష్‌రెడ్డి కాలనీలో సోమవారం ముస్లింలకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కొనుదల రమేష్‌రెడ్డి ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ముస్లింలతో కలసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో రమేష్‌రెడ్డి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

గుంతకల్లుటౌన్: పట్టణంలోని రాయలసర్కిల్‌లో అయ్యప్ప వాటర్ శ్రీనాథ్ సహకారంతో సీఐటీయూ అనుబంధ మహబూబ్ సుబానీ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం టూటౌన్ సీఐ మస్తాన్ ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, ఆటో యూనియన్ నాయకులు బాబూరావు, జాకీర్, సాధిక్, వినీత్, సునీల్ పాల్గొన్నారు.

శింగనమల: స్థానిక ఆర్టీసీ బస్టాండ్‌లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎంపీడీఓ భాస్కర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లీలారాణి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రశాంతంగా గణితం పరీక్ష

శింగనమల/పామిడి/గార్లదిన్నె: శింగనమలలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కేజీబీవీలలో సోమవారం పదవతరగతి గణితం పరీక్ష ప్రశాంతంగా జరిగిందని ఎంఈఓ నరసింహరాజు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 293 మంది విద్యార్థులకు 292 మంది, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 150 మందికి 148 మంది, కేజీబీవీలో 140 మంది విద్యార్థులకు 139 మంది హాజరయ్యారన్నారు. అలాగే పామిడిలోని టీసీహైస్కూల్, ఎస్ఎఫ్ఎస్, ఎస్ఎస్‌వీఎం, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పరీక్షకు 12 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. అదేవిధంగా గార్లదిన్నె మండలంలోని గార్లదిన్నె, కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్లో 688 మంది విద్యార్థులకు గాను 18మంది గైర్హాజరయ్యారని ఎంఈఓ చంద్రనాయక్ తెలిపారు.

పశువులకు బీమా చేయించండి

బుక్కరాయసముద్రం: పశువులకు బీమా చేయించుకోవాలని పశు సంవర్థక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రత్నకుమార్ సూచించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పశువులు ప్రమాదవశాత్తు, వ్యాధి బారిన మరణిస్తే రైతులకు ఆర్థిక నష్టం కలగకూడదనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం పశు బీమా పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఈ పథకంలో రూ.30 వేల నుంచి రూ.లక్ష వరకూ భీమా వర్తిస్తుందన్నారు. రైతులు ప్రీమియంలో 50 శాతం కడితే మిగిలిన ప్రీమియం ప్రభుత్వమే భరిస్తుందన్నారు. రైతులు భీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు బీకేఎస్, కొర్రపాడు వెటర్నరీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

కాలిపోయిన లారీల పరిశీలన


తిమ్మంపేట సమీపంలో కాలిపోయిన లారీని పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరు, తిమ్మంపేట గ్రామాల సమీపంలో అగ్ని ప్రమాదంలో కాలిపోయిన లారీలను సోమవారం అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వరుసగా రెండు రోజులు 44వ జాతీయ రహదారిపై రెండు లారీల్లో మంటలు వ్యాపించి వాహనంతో పాటు అందులో ఉన్న సరుకు కాలిపోవడంతో.. ప్రమాదంపై ఆరా తీశామన్నారు. ఎండకాలం కావడంతో దూర ప్రయాణం వెళ్లే వాహనదారులు మధ్యలో ఆగి వాహనం ఇంజన్ వేడి తగ్గించుకొని వెళ్లాలని డ్రైవర్లకు సూచించారు. వేగంగా వెళ్లడం వల్ల టైర్లు పగిలే అవకాశం ఉందని, నిదానంగా వెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ గౌస్‌మహమ్మద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రికి వాటర్ ట్యాంక్ వితరణ

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చౌదరి విజయ భాస్కర్ సోమవారం వేలాది రూపాయలు విలువ చేసే వాటర్ ట్యాంక్‌ను వితరణ చేశారు. వాటర్ ట్యాంక్‌ను ఆసుపత్రి సూపరింటెండెంట్ ఎల్లప్పకు ఆయన అందజేశారు. కార్యక్రమంలో గుత్తి కోట గౌరవ సలహాదారులు మంగే జయరావు, సహాయ కార్యదర్శి వీరేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం, రాష్ట్రాల్లో నిరంకుశ పాలన


మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్

శింగనమల: కేంద్రం, రాష్ట్రంలో నిరంకుశ పాలన కొనసాగుతోందని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మండిపడ్డారు. సోమవారం శింగనమలలో సీపీఐ 9వ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మతోన్మాద, కార్పొరేట్ శక్తుల విధానాలను అవలంబిస్తోందన్నారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పాళ్యం నారాయణస్వామి, నియోజకవర్గ కార్యదర్శి టి.నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కుంటలు, చెరువులు నీటితో నింపాలి


ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: నియోజకవర్గంలోని చెరువులు, కుంటలకు హంద్రీనీవా జలాలను అందించి రైతులను ఆదుకోవాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ఆర్డీఓ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, మండల కార్యదర్శి రాము రాయల్ మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గ వ్యాప్తంగా 42 చెరువులు, కుంటలు ఉన్నాయన్నారు. గతంలో చెరువులు వర్షపు నీటితో నిండేవని, తద్వారా 5,121 ఎకరాల భూమి సాగులోకి వచ్చేదన్నారు. ప్రస్తుతం చెరువులు, కుంటలు క్రమంగా ఆక్రమణలకు గురవడం, దానికితోడు ముల్ల పొదలు, పూడికతో నిండి నీటి నిలువ సామర్థ్యం భారీగా తగ్గిపోయిందన్నారు. అధికారులు వెంటనే పూడికతీత, కంపచెట్ల తొలగింపు చేపట్టి చెరువులు, కుంటలను హంద్రీనీవా జలాలతో నింపాలన్నారు. అలాగే రాగులపాడు తూమును ఏర్పాటు చేసి నియోజకవర్గంలోని అన్ని చెరువులకు నీటిని అందించాలన్నారు.

శ్మశాన వాటికకు స్థలాలు కేటాయించండి

గుంతకల్లుటౌన్: పట్టణంలో పెరిగిన జనాభాను దృష్టిలో ఉంచుకుని హిందూ, ముస్లిం, క్రైస్తవ మతస్తుల శ్మశాన వాటికలకు ప్రభుత్వ స్థలాల్ని కేటాయించాలని ఆర్డీఓ శ్రీనివాస్‌ను బీజేపీ నాయకులు కోరారు. సోమవారం ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్‌ను బీజేపీ పట్టణ అధ్యక్షుడు వడ్డేరమేష్ తదితరులు వేర్వేరుగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో శ్మశాన వాటికలకు కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని వారు విన్నవించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు విశ్వనాథ్, మహేష్, నారాయణరెడ్డి, క్రిష్ణమూర్తి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలని వినతి

గుత్తి రూరల్: ఇంటి స్థలాలు మంజూరు చేయాలంటూ మండలంలోని పెద్దొడ్డి గ్రామానికి చెందిన మహిళలు తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. ఇంటి స్థలాలు ఇచ్చి గృహాలు మంజూరు చేయాలని సుమారు 45 మంది మహిళలు తహసీల్దార్ ఓబిలేసును చుట్టుముట్టారు. ఇంటి స్థలాలు కేటాయించి గృహాలు మంజూరు చేయాలని గ్రామానికి చెందిన మహిళలు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు.

ఉపాధి హామీ బిల్లులు మంజూరు చేయండి

శింగనమల: కూలీలకు పెండింగ్ ఉన్న 10 వారాలు ఉపాధి బిల్లులు వెంటనే మంజూరు చేయాలని సీపీఎం నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ బ్రహ్మయ్యకు వినతిపత్రం అందజేశారు. ఉపాధి పనుల వద్ద తాగునీరు, నీడ కోసం టెంట్ ఏర్పాటు చేయడంతోపాటు మెడికల్ కిట్లు, పనిముట్లు పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం , వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సూర్య ప్రకాష్, సుంకన్న, జయరాముడు, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచిత విద్య అందించండి

తాడిపత్రి: విద్యా హక్కు చట్టం 2009 ప్రకారం 6 – 14 సంవత్సరాల మధ్య పిల్లలకు ఉచిత విద్యను అందించాలని కోరుతూ, సోమవారం ఏపీ బీడీ వర్కర్స్ అండ్ సిగార్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ అనుబంధ నాయకులతో కలసి ఎంఈఓ రామగోవిందరెడ్డికి ఆ యూనియన్ కన్వీనర్ ఉమాగౌడ్ వినతిపత్రం అందజేశారు. పేద, మధ్య తరగతి పిల్లలకు ఈ విద్యా హక్కు చట్టం వరంగా గత ప్రభుత్వం హయాం వరకు ఉండేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో ఆయా వర్గాల పిల్లలకు శాపంగా మారిందన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలన మనందరి లక్ష్యం


గుత్తిలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


క్షయవ్యాధి నిర్మూలనపై గార్లదిన్నెలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది


తాడిపత్రిలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న డాక్టర్లు, సిబ్బంది

గుత్తి/గార్లదిన్నె/బుక్కరాయసముద్రం/పెద్దవడుగూరు/తాడిపత్రి రూరల్/శింగనమల: క్షయ వ్యాధి నిర్మూలనే లక్ష్యమని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎల్లప్ప అన్నారు. గుత్తిలో సోమవారం ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్యులు, ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ , మానవ హారం నిర్వహించారు. క్షయ వ్యాధి అంతం మన పంతం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఎల్లప్ప మాట్లాడుతూ క్షయ వ్యాధికి మందులు సక్రమంగా వాడకపోతే ప్రాణాంతకమవుతుందన్నారు. క్షయ వ్యాధిని సమాజం నుంచి తరిమివేస్తామని అందరి చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వైద్యులు రమ్య శ్రీ, అయేషా, అమర్ నాథ్, హెడ్ నర్స్ నాగమణి, సూపర్‌వైజర్లు దేవదాస్, మన్సూర్ అలీ, ఖాజా , హ్యాండ్స్ మేనేజర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు. గార్లదిన్నెలో నిర్వహించిన కార్యక్రమంలో పీహెచ్‌సీ డాక్టర్ గౌతమి, సీహెచ్ఓ లోక్‌నాథ్, ఆరోగ్య విస్తరణ అధికారి నాగే శ్వరయ్య, పీహెచ్ఎన్ అరుణకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. బుక్కరాయసముద్రంలో డాక్టర్ తెహరున్నీసా, సీహెచ్ఓ మోహన్‌రావు, పీహెచ్ఎన్ చెన్నమ్మ, సూపర్ వైజర్ జానీరాజ్, ఆదినారాయణమ్మ, లక్ష్మి, వాణి, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు. పెద్దవడుగురులో డాక్టర్ అమర్‌నాథ్, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు. పామిడిలో సీహెచ్‌సీ వైద్యాధికారి జీ శివకార్తీక్‌రెడ్డి, ఎద్దులపల్లి వైద్యాధికారులు సుధాకర్, ఉదయార్క్, హెల్త్ సూపర్ వైజర్ శ్రీరామిరెడ్డి, ఏఎన్ఎంలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. తాడిపత్రిలో నిర్వహించిన ర్యాలీలో ఏరియా ఆసుపత్రి సూపర్‌వైజర్ సునీల్, డాక్టర్లు కేశవానంద, క్రిష్ణవేణి,లావణ్య, చుక్కలూరు పీహెచ్‌సీ సిబ్బంది, ఏరియా ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. శింగనమలలో తరిమెల పీహెచ్‌సీ వైద్యుడు శంకర్ నాయక్, సీహెచ్‌సీ వైద్యాధికారి రోహినాథ్, వైద్యులు చంద్రకళ, టిప్పు హౌసేన్, సూపర్‌వైజర్ ఉమా మహేశ్వరి, నాగమ్మ ఆశ్వర్థనారాయణ, ఆశా కార్యకర్తకు మంజుల తదితరులు పాల్గొన్నారు.